క్రాంతిహిల్స్‌కాలనీ అభివృద్ధికి కృషి : ఎంపీ ఈటల



ఎంపీ ఈటలను కలిసిన క్రాంతిహిల్స్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు

వనస్థలిపురం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం డివిజన్‌లోని క్రాంతి హిల్స్‌కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. క్రాంతిహిల్స్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బద్దం రాంరెడ్డి ఆధ్వర్యంలో కాలనీవాసులు కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం ఎంపీ ఈటలను మార్యాద పూర్వకంగా కలిశారు. ఈ మేరకు కాలనీలో సీసీ కెమరాలు ఏర్పాటు చేయాలని, పార్క్ స్థలాన్ని అభివృద్ధి చేసి ప్రహరీ నిర్మించాలని, సీనియర్ సిటిజన్ భవనాన్ని నిర్మించాలని ఎంపీకి విన్నవించారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు నూతి శ్రీనివాస్, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి మాజీ కార్పొరేటర్ల పరామర్శ

మన్సూరాబాద్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): వెన్నెముక సమస్యతో ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకుని గచ్చిబౌలిలోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ కార్పొరేటర్లు, ప్రధాన నాయకులు గురువారం పరామర్శించారు. ఎమ్మెల్యేను పరామర్శించిన వారిలో మాజీ కార్పొరేటర్లు కొప్పుల విఠల్‌రెడ్డి, జిట్టా రాజశేఖర్‌రెడ్డి, జీవీ సాగర్‌రెడ్డి, జిన్నారం విఠల్‌రెడ్డి, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ టంగుటూరి నాగరాజు, బీఆర్ఎస్ నాయకులు చంద్రారెడ్డి, చంద్రమోహన్, జక్కిడి రఘువీర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓపెన్ జిమ్ ప్రారంభం

ఎల్బీనగర్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆరోగ్యంతో పాటు శరీర దారుఢ్యం పట్ల శ్రద్ధ వహించాలని జీహెచ్ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి సూచించారు. లింగోజిగూడ డివిజన్ పరిధిలోని అధికారినగర్‌లో జీహెచ్ఎంసీ రూ. 10లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను కాలనీవాసులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, యువకులు చదువు, ఆటపాటలతో పాటు ఆరోగ్యంగా ఉండాలన్నారు. కాంగ్రెస్ నాయకులు శ్రీధర్‌గౌడ్, గౌస్, మహేశ్వరి, నరేష్, భాను, శివ, వినోద్, కాలనీ ప్రతినిధులు మైసయ్య, దశరథ, మహేందర్, జంగయ్య, యాదగిరి, యాదమ్మ, అనిత పాల్గొన్నారు.

తాగునీటి పైప్‌లైన్ పనులు చేపట్టాలి

వనస్థలిపురం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): నాణ్యతాలోపాలు లేకుండా తాగునీటి పైప్‌లైన్ పనులు చేపట్టాలని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. హయత్‌నగర్ డివిజన్ ఆటో సాయినగర్‌లో జరుగుతున్న తాగునీటి పైప్‌లైన్ పనులను గురువారం సంబంధిత అధికారులతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టాలి : లచ్చిరెడ్డి

వనస్థలిపురం : అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ శ్రీపురంకాలనీ ఫేజ్-2లో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను కాలనీవాసులతో కలిసి కార్పొరేటర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు సికిందర్‌రెడ్డి, బకారం నర్సింహారెడ్డి, కల్లు విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందేలా చూడండి

కొత్తపేట, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు తదితర సంక్షేమ పథకాలు నిజమైన లబ్ధిదారులకు అందేలా చూడాలని కార్పొరేటర్ పవన్‌కుమార్ అధికారులకు సూచించారు. డివిజన్‌లో అర్హులైన లబ్ధిదారుల ఎంపిక కోసం సర్వే చేపట్టిన నేపథ్యంలో గురువారం ఆయన వార్డు కార్యాలయాన్ని సందర్శించారు. డివిజన్ పరిధిలో ఇంతవరకు 6,600 లబ్ధిదారుల జాబితాలు ఉన్నాయని, వాటిలో 3,600 వరకు సర్వే నిర్వహించారని వార్డు ఇన్‌చార్జి మాధవరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో అధికారులు హరిప్రసాద్, సహదేవ్, శివస్థానిక నాయకులు పాల్గొన్నారు.

అలసత్వం వహిస్తే సహించేది లేదు : శ్వేతారెడ్డి

సైదాబాద్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల విషయంలో అధికారులు, కాంట్రాక్టర్లు అలసత్వం వహిస్తే సహించేది లేదని ఐఎస్‌సదన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం డీఎస్‌నగర్‌లో రెండేళ్లుగా నిలిచిపోయిన నాలా నిర్మాణ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. కాంట్రాక్టర్లు అసంపూర్తిగా పనులు నిలిపివేస్తే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని అధికారులను ప్రశ్నించారు. పనులను వెంటనే ప్రారంభించి పూర్తిచేయాలని అన్నారు. జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ ఈఈ ఏకాంబరం, ఏఈలు అన్సారీ, శిరీష, బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు మధుకర్‌రెడ్డి, బస్తీవాసులు రమేష్, సాయి, జగన్, ధన్‌రాజ్ పాల్గొన్నారు.



శ్మశానవాటిక స్థలాన్ని పరిశీలిస్తున్న వక్ఫ్‌బోర్డు చైర్మన్ సయ్యద్ అజముల్లా, ఎమ్మెల్యే జాఫర్‌హుస్సేన్

వక్ఫ్‌బోర్డు శ్మశానవాటిక స్థలాన్ని పరిరక్షిస్తాం

సైదాబాద్: మాదన్నపేటలో వక్ఫ్‌బోర్డు నోటిఫైడ్ శ్మశానవాటిక స్థలాన్ని అన్యాక్రాంతం కాకుండా పరిరక్షిస్తామని తెలంగాణ వక్ఫ్‌బోర్డు చైర్మన్ సయ్యద్ అజముల్లా తెలిపారు. గురువారం యాఖత్‌పురా ఎమ్మెల్యే జాఫర్‌హుస్సేన్‌తో కలిసి మాదన్నపేట శ్మశానవాటిక స్థలం లో చేపడుతున్న అక్రమ నిర్మాణాలను పరిశీలించారు. కొందరు వ్యక్తులు 20 సంవత్సరాలుగా శ్మశానవాటిక స్థలాన్ని కొంత కబ్జా చేసి వ్యాపారాలు చేస్తున్నా ఊరుకున్నామని తెలిపారు. కానీ ఉద్దేశపూర్వకంగా అగ్నిప్రమాదం సృష్టించి దుకాణం కాలిపోయినట్లుగా నాటకమాడుతున్నారని అన్నారు. అదేఅదనుగా శ్మశానవాటిక ప్రహరీని కూల్చి స్థలాన్ని మరింతగా ఆక్రమించే విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ పలుమార్లు వక్ఫ్‌బోర్డుకు ఫిర్యాదు చేయడం జరిగిందని వెల్లడించారు.

ఓటు చైతన్యం కోసం విద్యార్థుల ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐజాజ్ సుల్తానా

హైదరాబాద్ సిటీ, జనవరి 23(ఆంధ్రజ్యోతి) : ఓటు చైతన్యం కోసం ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) విద్యార్థులు గురువారం చెంచల్‌గూడలో ర్యాలీ నిర్వహించారు. 25న జరిగే ఓటర్స్ డే పురస్కరించుకొని నిర్వహించిన ఈ ర్యాలీని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐజాజ్ సుల్తానా ప్రారంభించారు. అనంతరం ఐజాజ్ సుల్తానా మాట్లాడుతూ ప్రజాస్వామ్య మనుగడలో ఓటు చాలా కీలకపాత్ర పోషిస్తుందని, అందుకని ప్రతీ పౌరుడు ఓటును వేయడాన్ని తన బాధ్యతగా గుర్తించాలని అన్నారు. కార్యక్రమంలో రాజనీతిశాస్త్ర విభాగ అధ్యక్షులు డాక్టర్ ఎస్.భిక్షం, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్స్ పట్టా వెంకటేశ్వర్లు, అధ్యాపకులు శ్రీలక్ష్మి, ఎస్.శైలజ, శ్రీనివాసులు, నవీన్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు ఎన్నిసార్లు దరఖాస్తులు ఇవ్వాలి?

- ప్రజాపాలన దరఖాస్తులు ఏమయ్యాయి
- కులగణన సర్వే పత్రాలు ఎక్కడికి పోయాయి
- ప్రభుత్వ తీరుపై ఎమ్మెల్యే సబిత ఆగ్రహం



మీర్‌పేట్‌లో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి, పాల్గొన్న మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు

సరూర్‌నగర్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): 'ఏదైనా ఓ సంక్షేమ పథకానికి ఒకసారి దరఖాస్తు చేసుకుంటే దాని ఆధారంగా లబ్ధిదారులను గుర్తిం చి పథకం వర్తింపజేయాలి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ మళ్లీ దరఖాస్తులు పెట్టుకోవాలని అంటోంది.. అసలు ఈ ప్రభుత్వానికి సంక్షేమ పథకాలు అమలు చేసే ఉద్దేశం ఉందా లేదా?'.. అని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి నిలదీశారు. ఒక్క పథకానికి ప్రజలు ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకోవాలని ఆమె ప్రశ్నించారు. మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని 1,2,3,4,15,16,20, 39,40,41వ డివిజన్లలో రూ.4.42కోట్ల వ్యయంతో చేపట్టిన/చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు గురువారం మేయర్ దుర్గాదీప్‌లాల్, డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్‌రెడ్డితో కలిసి ఆమె శంకుస్థాపనలు/ప్రారంభోత్సవాలు చేశా రు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ గతంలో టెంట్లు వేసి, పోలీసులను పెట్టి ప్రజాపాలన పేరుతో సభలు ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలకు దరఖాస్తులు తీసుకున్నారని, ఇప్పుడు అవన్నీ ఏమయ్యాయని ప్రశ్నించారు. ఇటీవల కులగణన సర్వే సందర్భంగా కూడా ప్రజల నుంచి అన్ని వివరాలు సేకరించారని, ప్రభుత్వ పథకాలు అందని వారి వివరాలు సైతం తీసుకున్నారని, ఆ సర్వే ఎక్కడికి పోయిందని సబిత నిలదీశారు. మరో నాలుగేళ్లదాకా ప్రజలు దరఖాస్తులు ఇస్తూ పోవాలా?.. అసలు వారికి పథకాలు ఇస్తారా ఇవ్వరా? అని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. 'రేవంత్ సర్కార్‌కు మతిమరుపు ఉన్నట్టుంది.. అందుకే మళ్లీ మళ్లీ దరఖాస్తులు అడుగుతున్నారు'.. అని ఆమె ఎద్దేవా చేశారు. గ్రామ/వార్డు సభలు పోలీసు నిర్బంధాల నడుమ నడుస్తున్నాయని, ప్రశ్నించే వాళ్లను పక్కకు తోసేస్తున్నారని, ఇదేం ప్రజాపాలన అని ఆమె విమర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, మునిసిపల్ అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు కేటాయించండి

- జీహెచ్ఎంసీ కమిషనర్‌కు ఎమ్మెల్యే లేఖ

ఎల్బీనగర్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని సరూర్‌నగర్, ఆర్కేపురం డివిజన్లలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే సబితారెడ్డి జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తిని కోరారు. గురువారం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లతో కలిసి జీహెచ్ఎంసీ కమిషనర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆర్కేపురం, సరూర్‌నగర్ డివిజన్ల పరిధిలో 23పనులను చేపట్టేందుకు రూ. 12.23కోట్ల నిధులు మంజూరు చేయాలని కమిషనర్‌ను కోరారు. సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని ఎస్‌బీఐకాలనీ, అంబేడ్కర్‌నగర్, భగత్‌సింగ్‌నగర్, శంకర్‌నగర్, విజయపురికాలనీ, ఆర్కేపురం డివిజన్ పరిధిలోని టెలిఫోన్‌కాలనీ, మార్గదర్శికాలనీ, ఎన్టీఆర్‌నగర్, సాయిబాబానగర్, హరిపురికాలనీ, ఆర్కేపురం, సరోజినీనగర్, అల్కాపురి, చిత్రాలేఅవుట్, సిరినగర్‌లలో సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, బీటీ రోడ్లు, సీనియర్ సిటిజన్ భవనం, మహిళా భవనాలు, ట్రంక్‌లైన్, కమ్యూనిటీహాల్, పార్కు పనులకు నిధులు విడుదల చేయాలని ఆమె కమిషనర్‌కు లేఖ రాశారు.

ఫారెస్ట్ స్థలాన్ని ప్రైవేటుగా చిత్రీకరిస్తే కఠిన చర్యలు

- సర్వే నం.7లోని 582 ఎకరాల స్థలం అటవీ శాఖదే
- శంషాబాద్ డీఎఫ్ఓ విజయానందరావు



మాట్లాడుతున్న డీఎఫ్ఓ విజయానందరావు, తహసీల్దార్ వేణుగోపాల్

మన్సూరాబాద్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): హరిణవనస్థలి నేషనల్ పార్కు స్థలాన్ని ప్రైవేటు భూమిగా చూపించే వారిపై కఠిన చర్యలు తప్పవని, సర్వే నంబర్.7లోని 582 ఎకరాలు గల ఈ భూమి అటవీశాఖకు సంబంధించినదేనని శంషాబాద్ డీఎఫ్ఓ విజయానందరావు, సరూర్‌నగర్ తహసీల్దార్ వేణుగోపాల్ పేర్కొన్నారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని హరిణవనస్థలి నేషనల్ పార్కు ప్రాంగణంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సర్వే నం.7లోని 582ఎకరాల స్థలం తమ తల్లిదని యూసుఫ్‌ఖాన్ అతడి భార్య తులసమ్మ అలియాస్ సుల్తానాలు గిఫ్ట్ డీడ్, సేల్‌డీడ్, నోటరీ ప్లాట్లుగా నకిలీ పత్రాలను సృష్టించి కొందరు అమాయకులకు అమ్మకాలు చేపట్టి మోసాలకు పాల్పడుతున్నారన్నారు. సదరు మోసగాళ్లు ఈ నెల 26న గణతంత్ర వేడుకలను ఆ స్థలంలో జరుపుతున్నామని, ప్లాట్లకు చెందిన వారు రావాలంటూ సోషల్ మీడియాలో వీడియోలు వస్తున్నాయన్నారు. ఈ స్థలం అటవీ శాఖకు చెందినదని రికార్డుల్లో ఉందని, ప్రైవేటు స్థలంగా చూపుతూ సదరు స్థలంలో ఎలాంటి కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు ఉంటాయని అధికారులు హెచ్చరించారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ బి.సాయిప్రకాశ్, సెక్షన్ ఆఫీసర్ విద్యాసాగర్, నవీన్‌రెడ్డి, కృష్ణవేణి, సుజాత, ఉమాదేవి పాల్గొన్నారు.



మేయర్ పారిజాతారెడ్డికి దరఖాస్తులు అందజేస్తున్న లబ్ధిదారులు

సంక్షేమ పథకాలు అందరికీ అందుతాయి

- బడంగ్‌పేట్ మేయర్ పారిజాతారెడ్డి

సరూర్‌నగర్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు అన్ని సంక్షేమ పథకాలు కచ్చితంగా అందజేస్తుందని, దీనిపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయని ఆమె స్పష్టం చేశారు. జాబితాలో పేర్లు లేనంత మాత్రాన అనర్హులు కాదని, మళ్లీ దరఖాస్తు చేసుకుంటే కచ్చితంగా పథకం వర్తిస్తుందని ఆమె అన్నారు. గురువారం మూడో రోజు కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో నిర్వహించిన వార్డు సభల్లో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా రైతుభరోసా, ఇందిరమ్మఇళ్లు, రేషన్‌కార్డులకు సంబంధించిన లబ్ధిదారుల జాబితాను బహిరంగంగా చదివి వినిపించి స్థానికుల నుంచి అభ్యంతరాలు స్వీకరించారు. కాగా తమ పేర్లు జాబితాల్లో లేకపోవడంతో పలు డివిజన్లలో ప్రజలు ఆందోళన వ్యక్తం చేయగా వారికి మేయర్, అధికారులు సర్దిచెప్పారు. కార్యక్రమంలో కమిషనర్ పి.సరస్వతి, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, మునిసిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ సంరక్షణపై అవగాహన కలిగి ఉండాలి

వనస్థలిపురం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నిత్యజీవితంలో జీవశాస్త్రంలో ప్రాముఖ్యతను, పర్యావరణ సంరక్షణపై తగిన అవగాహన కలిగి ఉండాలని రంగారెడ్డి జిల్లా సైన్స్ అధికారి వై.శ్రీనివాసరావు అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సాహెబ్‌నగర్‌లోని జిల్లా ప్రభుత్వ పాఠశాలలో తెలంగాణ బయోసైన్స్ ఫోరం రంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జీవశాస్త్ర టాలెంట్ పరీక్షలు విజయవంతంగా ముగిసాయి. ఈ పరీక్షలకు తెలుగు, ఇంగ్లీష్ మీడియంతో పాటు మోడల్ స్కూల్, రెసిడెన్సియల్ స్కూల్స్ విద్యార్థులు హాజరై తమ ప్రతిభను కనబర్చారు. అనంతరం రంగారెడ్డి జిల్లా బయోసైన్స్ ఫోరం అధ్యక్షులు రావుల రాజమల్లేష్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి హాజరైన వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి జీవశాస్త్రాన్ని చదివి డాక్టర్లు, వ్యవసాయ శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిధర్, డిసిఈబి సెక్రటరీ జనరల్ అరుణ్‌సాగర్, ప్రధానోపాధ్యాయులు దినేష్, రాధాకృష్ణరెడ్డి, వనమల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



అల్మాస్‌గూడ శ్మశానవాటికలో నిర్మించిన షెడ్డును ప్రారంభిస్తున్న రామిడి ప్రతాప్‌రెడ్డి

'అమ్మ'యాదిలో.. రాంరెడ్డి ఔదార్యం

- సొంత ఖర్చుతో అల్మాస్‌గూడ శ్మశానవాటికలో షెడ్డు నిర్మాణం
- అనాథాశ్రమానికి బియ్యం వితరణ

సరూర్‌నగర్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మాతృమూర్తి మరణించి 17 ఏళ్లవుతున్నా ఆమె కొడుకు తన సేవా కార్యక్రమాలను మరవడం లేదు. ప్రతియేటా ప్రజలకు ఉపయోగపడేలా ఏదో ఒక సేవా కార్యక్రమం చేపట్టే బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడ మాజీ సర్పంచ్ రామిడి రాంరెడ్డి.. ఈ ఏడాది తన తల్లి రామిడి కళావతి స్మారకార్థం స్థానిక శ్మశానవాటికలో ఓ షెడ్డు నిర్మింపజేశారు. సుమా రు రూ.4.50లక్షలు సొంత ఖర్చుతో నిర్మించిన సదరు షెడ్డును గురువారం తన తండ్రి రామిడి ప్రతాప్‌రెడ్డి చేత ప్రారంభింపజేశారు. అదే విధంగా నాదర్‌గుల్‌లోని మాతృదేవోభవ అనాథాశ్రమంలో అభాగ్యులకు అన్నదానం నిర్వహించి, ఆశ్రమానికి బియ్యం సైతం వితరణ చే శారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ అమ్మ జ్ఞాపకార్థం భవిష్యత్‌లోనూ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తానని చెప్పారు. గతంలో కూడా శ్మశానవాటికలో రెండు షెడ్లు నిర్మింపజేశానని, కాలనీల్లో పార్కులను సొంత డబ్బుతో అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చానని ఆయన తెలిపారు. అమ్మ లేకుంటే తాను లేనని, అందుకే ఆమెను ఎన్నటికీ మరువబోనని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో అల్మాస్‌గూడ కార్పొరేటర్లు, వివిధ పార్టీల నాయకులు, గ్రామపెద్దలు, రాంరెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రామ, వార్డు సభలు

- మండలంలో కొత్తగా 2,227, మున్సిపాలిటీలో 4,869 దరఖాస్తుల స్వీకరణ

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు, ఇందిర్మ ఇళ్ల సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపికల్లో భాగంగా మండలంలో నిర్వహించిన గ్రామ సభలు ముగిశాయి. గురువారం మజీద్‌పూర్, బాటసింగారం, చిన్నరావిరాల, ఇనాంగూడ గ్రామాల్లో సభలు జరిగాయి. ఆయా పథకాలకు ఎంపికైనా లబ్ధిదారుల పేర్లతో కూడిన జాబితాను అధికారులు సభలో చదివి వినిపించారు. సభకు హాజరైన ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించారు. లిస్ట్‌లో పేరు రాని వారి నుంచి మరోసారి దరఖాస్తులను స్వీకరించారు. మండలంలోని 14గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభలో ప్రజల నుంచి కొత్తగా రేషన్ కార్డులకు-990, ఇందిరమ్మ ఇళ్లకు-786, రైతు భరోసాకు-1, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు-450 దరఖాస్తులను స్వీకరించినట్లు ఎంపీడీవో తెలిపారు.



దరఖాస్తులను స్వీకరిస్తున్న చైర్‌పర్సన్ జయశ్రీ, కమిషనర్

పెద్దఅంబర్‌పేట్‌లో..

పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని 5,23,10,11,12,17,18,24వ వా ర్డుల్లో గురువారం గ్రామ సభలు నిర్వహించారు. 5వ వార్డు అంబేడ్కర్ భవనంలో నిర్వహించిన వార్డు సభలో ఛైర్‌పర్సన్ పండుగుల జయశ్రీరాజు, వైస్ చైర్‌పర్సన్ చామ సంపూర్ణావిజయశేఖర్‌రెడ్డి, స్థానిక కౌన్సిలర్ బొర్ర అనురాధాసురేష్, కమిషనర్ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వార్డు ప్రజల నుంచి ఆయా పథకాలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించారు. మూడు రోజుల్లో 3,862 రేషన్ కార్డులకు, 1007 ఇందిరమ్మ ఇళ్ల పథకానికి దరఖాస్తులు వచ్చినట్లు కమిషనర్ తెలిపారు.

దశలవారీగా మన్సూరాబాద్‌లో సమస్యల పరిష్కారం

మన్సూరాబాద్, జనవరి 23(ఆంధ్రజ్యోతి) : డివిజన్‌లో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నట్లు మన్సూరాబాద్ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని ఆగమయ్యకాలనీలో రూ.20.30 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును గురువారం కాలనీ సంక్షేమ సంఘం సభ్యులతో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఆగమయ్యనగర్ కాలనీ అధ్యక్షుడు మిడిదొడ్డి అంజనేయు లు, కార్యదర్శి సతీష్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, వసుధ, సుజాత, వసంతి, కుదీరం బోసు, వెంకటాచారి, శ్రీరాములు, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పెండింగ్ పనులన్నీ త్వరలో పూర్తి



హయత్‌నగర్ ఏరియాలోని పలు కాలనీలలో మార్నింగ్ వాక్ చేస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

హయత్‌నగర్ : డివిజన్‌లోని శ్రీకృష్ణహిల్స్, శివగంగాకాలనీ, సీఎస్ఆర్‌కాలనీలో కాలనీ సంక్షేమ సంఘం నాయకులతో కలిసి కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి గురువారం పర్యటించారు. ప్రజల వద్ద నుంచి సమస్యలపై వినతిపత్రాలు తీసుకున్నారు. పెండింగ్ పనులను పూర్తి చేస్తామన్నారు. కాలనీ నాయకులు శ్రీనివాస్ సత్తిపండు, సుర్వి శ్రీనివాస్‌గౌడ్, లింగయ్యాయాదవ్, రవీందర్‌రావు, గోపాల్‌రెడ్డి, ఎర్ర శ్రీను పాల్గొన్నారు.

మహేశ్వరం జోన్‌లో డిజిటల్ కమ్యూనికేషన్ సేవలు ప్రారంభం

- అదనపు వ్యయం లేకుండా అనలాగ్ నుంచి డిజిటల్‌కు అప్‌గ్రేడ్
- ప్రారంభించిన రాచకొండ సీపీ సుధీర్‌బాబు



సమావేశంలో పాల్గొన్న రాచకొండ సీపీ జి. సుధీర్‌బాబు, ఐటీ కమ్యూనికేషన్ డీఐజీ శ్రీనివాసరావు తదితరులు

హైదరాబాద్ సిటీ, జనవరి 23(ఆంధ్రజ్యోతి): అందుబాటులో ఉన్న పరికరాలతో.. ఎటువంటి అదనపు వ్యయం లేకుండా, నూతన సాంకేతిక పరిజ్ఞానం సాయంతో డిజిటల్ కమ్యూనికేషన్ వ్యవస్థను మహేశ్వరం జోన్‌లో అందుబాటులోకి తెచ్చామని రాచకొండ సీపీ జి. సుధీర్‌బాబు తెలిపారు. కమిషనరేట్‌లో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహేశ్వరం జోన్‌లోని అన్ని పోలీస్‌స్టేషన్ల కమ్యూనికేషన్ వ్యవస్థను అనలాగ్ నుంచి డిజిటల్‌కు అప్‌గ్రేడ్ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కమిషనరేట్ నుంచి మహేశ్వరం జోన్‌లో ఉన్న 1715 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న 10 పోలీస్‌స్టేషన్‌లతో అంతరాయం లేకుండా సమాచార మార్పిడి జరుగుతుందన్నారు. పైలెట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభించిన డిజిటల్ కమ్యూనికేషన్ సేవలను త్వరలోనే రాచకొండ కమిషనరేట్ మొత్తం అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. పోలీస్‌శాఖలో అందుబాటులో ఉన్న పరికరాలను ఉపయోగించి, అనలాగ్ కమ్యూనికేషన్ వ్యవస్థను డిజిటల్ కమ్యూనికేషన్‌కు అభివృద్ధి చేయడం దేశంలోనే మొదటిసారి అన్నారు. అనలాగ్ నుంచి డిజిటల్ సేవలకు మార్పు కోసం ఎటువంటి అదనపు వ్యయం చేయలేదన్నారు. డిజిటల్ సిగ్నల్స్ ద్వారా డాటా ప్రసారం చేయడం ద్వారా, గతంతో పోల్చితే సమాచారం మార్పిడి, కమ్యూనికేషన్ వేగంగా జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఐటీ కమ్యూనికేషన్ డీఐజీ జె శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ డీసీపీ నర్సింహారెడ్డి, ఎస్పీ ఆర్జె సుధాకర్, అదనపు డీసీపీ అడ్మిన్ శివకుమార్, ఐటీసెల్ ఏసీపీ నరేందర్‌గైడ్, సీసీఆర్బీ ఏసీపీ రమేష్, ఇన్‌స్పెక్టర్లు మురళీకృష్ణారెడ్డి, భానుప్రసాద్, జ్ఞానసుందరి పాల్గొన్నారు.

రేపటి నుంచి మెగా చెస్ టోర్నమెంట్

- వరాస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహణ

హైదరాబాద్ సిటీ, జనవరి 23(ఆంధ్రజ్యోతి): వరాస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 25నుంచి అండర్ 15 ఆలిండియా మెగా చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని అకాడమీ ఫౌండర్, చీఫ్ కోచ్ రాఘవ్ శ్రీవాత్సవ్ వరయోగి తెలిపారు. జాతీయ స్థాయిలో రెండోసారి ఏర్పాటు చేస్తున్న మెగా చెస్ టోర్నమెంట్ విజేతలకు రూ.75వేల నగదుతోపాటు 50 ట్రోఫీలు అందిస్తామన్నారు. బేగంపేట పాటిగడ్డ జీహెచ్ఎంసీ మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్(రసూల్‌పురా మెట్రోస్టేషన్) సమీపంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో పాల్గొనాలనుకునే వారు 7396847937నంబర్‌ను సంప్రదించాలని, లేదా వివరాలకు www.varaschessacadamy.com వెబ్‌సైట్ చూడవచ్చని తెలిపారు.

1న లక్షడప్పులు, వేయిగొంతుల సదస్సు

చాదర్‌ఘాట్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలులో తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న జాప్యాన్ని నిరసిస్తూ ఫిబ్రవరి 1న బన్సిలాల్‌పేటలో జరగనున్న లక్షడప్పులు, వేయిగొంతుల హైదరాబాద్ జిల్లా సన్నాహక సదస్సును జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు వేల్పుల విష్ణుమాదిగ విజ్ఞప్తి చేశారు. ఈనెల 17న ప్రారంభమైన డప్పుల ప్రదర్శన మూసారాంబాగ్‌లోని వివిధ ప్రాంతాల్లో రెండురోజులుగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు ఎస్సీ వర్గీకరణను అమలు చేయకుండా తెలంగాణ ప్రభుత్వం కమిషన్ల పేరుతో జాప్యం చేస్తుందని, తక్షణమే వర్గీకరణ చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ లక్ష డప్పులు, వేయిగొంతుల సదస్సు ఫిబ్రవరి 7న ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజాలో జరగనుందని వివరించారు. ఈ సదస్సుకు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి బొర్ర భిక్షపతి మాదిగ, రాష్ట్ర నాయకులు మైలపాక రాంచందర్‌మాదిగ, నర్సింగ్‌రావు, మురళీమోహన్, నాయకులు దుర్గాప్రసాద్, మల్లికార్జున్‌మాదిగ పాల్గొన్నారు.

వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించాలి

- మలక్‌పేట ఈస్ట్ జోన్ ఆర్టీవో ఎల్. కిష్టయ్య



ట్రాఫిక్ అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న మలక్‌పేట ఈస్ట్‌జోన్ ఆర్టీవో కిష్టయ్య

చాదర్‌ఘాట్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలు పాటించాలని, అప్పుడే రోడ్డు ప్రమాదాలను నివారించగలుగుతారని మలక్‌పేట ఈస్ట్ జోన్ ఆర్టీవో ఎల్.కిష్టయ్య అ న్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని సడ క్ సురక్షా అభియాన్-జాగ్రత్త కార్యక్రమంలో భాగంగా గురువారం కార్ల డ్రైవర్లతో నిర్వహించిన ట్రాఫిక్‌పై అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్లను నడిపే సమయంలో తప్పనిసరిగా సీటు బెల్ట్ ధరించాలని సూచించారు. మొబైల్ మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనం నడపడం ప్రమాదకరమన్న విషయాన్ని వాహనదారులు గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఎంవీఐ లు అమర్‌నాథ్, నరేంద్ర పాల్‌సింగ్, రాధిక, రమేష్‌బాబు, బలరాం, ఏఎంవీఐలు మధుసూదన్‌రెడ్డి, అష్రఫ్‌ఖాన్, జాన్ పాల్గొన్నారు.

పిల్లలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలి

మన్సూరాబాద్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): పిల్లలకు విద్యార్థి దశ నుంచే రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించాలని మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు జ్ఞానేశ్వర్, వేణు, ప్రసాద్‌మురారి, అభిలాష్‌లు పేర్కొన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా నాగోల్ ఆర్టీఓ ఆధ్వర్యంలో ఇన్‌చార్జి ఆర్టీఓ అమర్‌నాథ్ ఆదేశాల మేరకు గురువారం స్నేహపురి కాలనీలోని శాంతినికేతన్ టాలెంట్ పాఠశాల విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, కానిస్టేబుళ్లు మహేష్, గిరి పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం



ఆర్.బాలకృష్ణ

చాదర్‌ఘాట్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి వెళ్లిన తన సోదరుడు ఇంత వరకు తిరిగి రాలేదంటూ అతని అన్న చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చాదర్‌ఘాట్ ఉస్మాన్‌పుర నివాసి ఆర్.బాలకృష్ణ(35) ఈనెల 16వ తేదీన ఇంటి నుంచి మొబైల్ ఫోన్ మాట్లాడుతూ బయటికి వెళ్లాడన్నారు. ఇంతవరకు తిరిగి రాకపోవడంతో అతని సోదరుడు రాపర్తి హరీష్‌కుమార్ చాదర్‌ఘాట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ తిరుపతి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.